సాక్షి తిరుపతి

మంగళవారం ; 28 ; ఫిబ్రవరి ; 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,420
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,129
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,400
రిటైల్ వెండి గ్రాము	రూ.67.40

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	19
తిరుమల	29	15
చిత్తూరు	34	19
గూడూరు	33	21
నగరి	34	20




సైన్స్ డే

జాతీయ సైన్స్‌డేని పురస్కరించుకుని బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సైన్స్ అక్షరాకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు.
- బుచ్చినాయుడుకండ్రిగ

న్యూస్‌రీల్

నేనేంటో నా ప్రజలకు తెలుసు



తిరుపతి రూరల్: 'నేనేంటో.. నా మనస్తత్వం ఏంటో నా ప్రజలకు తెలుసు. అంతకన్నా నేను నమ్ముకున్న ఆ భగవంతుడికి ఇంకా బాగా తెలుసు.. నాపైన చేసిన ప్రతి విమర్శ వారి విజ్ఞతకే వదిలేస్తున్నా' అని ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ తనపై చేసిన విమర్శలకు ఆయన పై విధంగా స్పందించారు. ఆమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్పందనకు 51 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలకు సంబంధించి పెద్ద మొత్తంలో ఫిర్యాదులు ఉన్నట్టు వెల్లడించారు. వెంటనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు.

1న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

గూడూరు: మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలను అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యాంమ్మోహన్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతీయువకులకు శ్రీ సిటీలోని స్కిల్ కళాశాలలో ఐదు నెలలపాటు ఉచిత వసతి, శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఈమేరకు ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణులైన యువతీయువకులకు మార్చి 1వ తేదీన గూడూరులోని ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 95050 23016 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల భద్రతపై సదస్సు

తిరుపతి తుడా: ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో సోమవారం సాయంత్రం విద్యార్థుల భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల నష్టాలు, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, దిశా చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉండాలని కోరారు. దిశ పోలీస్ కె.స్వాతి స్మార్ట్ ఫోన్ జాగ్రత్తగా ఎలా వాడాలి అనే విషయాలను తెలియజేశారు. మరో పోలీస్ ఆశ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ వల్ల జరిగే దుష్పరిణామాలు, విధించే శిక్షలను తెలియజేశారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ విక్రయిస్తే చర్యలు



ఆక్వా ఫీడ్ దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

చిల్లకూరు: ఆక్వా సాగుకు అవసరమైన ఫీడ్ విక్రయించే సమయంలో రైతులకు యాంటీ బయాటిక్స్ విక్రయిస్తే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి రూత్ హెచ్చరించారు. మండలంలోని పలు ఆక్వా ఫీడ్ దుకాణాలను సోమవారం పలు శాఖల అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఫీడ్, రసాయనాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని మందులకు సంబంధించిన బిల్లులు లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపెడా ఏడీ రామన్ మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతులు కూడా రసాయనాలను వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో కోట మత్స్యశాఖాధికారి రెడ్డినాయక్, నాయుడుపేట మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, డీపీఎం ధనుంజయ, వీఎఫ్ఏ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి అనంతవరం శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి అలిపిరి: గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, అనంతవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 4 నుంచి 7 వరకు జరగనున్నాయి. మార్చి 4న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 5 ఉదయం 7.45 గంటలకు మీన లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 6న రాత్రి స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణ మహోత్సవం, 7న రాత్రి గరుడ వాహనం, ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. 4, 11, 18 తేదీల్లో ఫాల్గుణ మాస శనివార ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రకృతితో సాగుదాం!



- ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట
- ప్రజల ఆరోగ్యం, అధిక పంట ఉత్పత్తులే లక్ష్యం
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 44 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు
- ఈ ఏడాది కొత్తగా మరో 17 వేల ఎకరాల్లో సాగుచేస్తున్న వైనం
- రసాయనాల వాడకానికి దూరమవుతున్న అన్నదాతలు
- ప్రకృతి పంటల వైపు ఆకర్షితులవుతున్న ప్రజలు



తిరుపతి అర్బన్: పాడిపంటలతో అన్నపూర్ణగా పేరొందిన తిరుపతి జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు అధికారుల సూచనలు, సలహాలతో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం గడిస్తున్నారు. రసాయనాలకు దూరంగా పంటలు పండిస్తున్నారు. ప్రజల భూసారం దెబ్బతినకుండా పంటకు పంటకు మధ్యలో 30 రకాల ఇతర పంటలు పండిస్తున్నారు. వాటిని పశువులకు గ్రాసంగా ఉపయోగించి అధిక పాల ఉత్పత్తులకు బాటలు వేస్తున్నారు. యువ రైతులు, మహిళా రైతుల భాగస్వామ్యం, ప్రజల ఆరోగ్యానికి, పోషకాహార భద్రత, పర్యావరణ పునరుద్ధరణ, వాతావరణ మార్పులకు తగినట్లుగా పంటలు సాగుచేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు

తిరుపతి జిల్లాలో ఇప్పటికే 44వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగులో ఉంది. ఇందులో 50శాతం వరి, మిగిలిన 50 శాతం మామిడి, నిమ్మ, ఆకు కూరలు, కూరగాయలు సాగవుతున్నాయి. ఈ ఏడాది మరో 20 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతిలో పంటలు పండించేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఇప్పటికే 17 వేల ఎకరాల్లో పూర్తి స్థాయిలో వ్యవసాయ యార్డ్‌ల ఎరువు, వర్మి కంపోస్ట్, ఆవు పేడ, పంచితం, మజ్జిగతో కాషాయాలు ఉపయోగించి, సింథటిక్ రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు సంహారకాలు వంటివి వాడకుండా పంటలు సాగుచేందుకు దోహదపడ్డారు.



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయల పంటలు

ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నాం



"రైతులు ప్రకృతి సాగు వైపు మొగ్గు చూపడం శుభపరిణామం. క్యాన్సర్ కారకాలకు ఒకరకంగా ఆహార అలవాట్లు కూడా ప్రధాన కారణమని డాక్టర్లు చెబుతున్నారు. రసాయనాలు లేని ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం. టీటీడీ సహకారంతో ప్రకృతి వ్యవసాయానికి ఇప్పటికే 210 పాడి ఆవులను అందించాం.

– కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

ఈ ఏడాది 20వేల ఎకరాలు టార్గెట్



ఈ ఏడాది తిరుపతి జిల్లలో 20 వేల ఎకరాల్లో పూర్తి స్థాయిలో ప్రకృతి సాగులో పంటలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 17 వేల ఎకరాలు సాగులోకి తెచ్చాం. మొత్తం 192 పంచాయతీల్లో 281 సంఘాలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. మామిడి, మిర్చి పంటలు తిరుపతి జిల్లాలో చాలాబాగా ఉన్నాయి. ఆశించిన దిగుబడి వస్తోంది.

–మునిరత్నం, రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

అధిక దిగుబడే లక్ష్యం



ఖరీఫ్, రబీలో పంటల సాగుకు ముందు చిరు, పప్పు ధాన్యాలను చల్లి వచ్చే పంటను పశువులకు గ్రాసంగా ఉపయోగించవచ్చు. సింథటిక్ రసాయనాలు అవసరం లేకుండా భూసారాన్ని పెంచి వేరు వ్యవస్థ, సూక్ష్మ జీవుల విడుదల, మిత్ర పురుగుల అభివృద్ధితో పంటల దిగుబడి, అధిక ఆదాయం సాధించొచ్చు.

–సురేంద్రరెడ్డి, సీనియర్ కన్సల్టెంట్

తక్కువ ధరకే ప్రకృతి పంటలు



నేను రెండేళ్లుగా తిరుపతి నుంచి ప్రతి వారం ఎస్‌బీఆర్‌పురానికి వెళ్లి ఆకు కూరలు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటా. మా బంధువులు, మిత్రుల కుటుంబ సభ్యులు కూడా ప్రకృతి పంటలనే కొనుగోలు చేస్తున్నారు. ధరలు కూడా పెద్దగా లేవు. ఎంతో సంతోషంగా ఉంది. –రామకృష్ణరాజు, బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి, తిరుపతి

అధికారుల అవగాహనతోనే



మా గ్రామంలో మూడేళ్లుగా మామిడి తోటలను ప్రకృతి సాగులోకి తీసుకొచ్చాం. అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడంతో ఏడాది పొడవునా రెండు ఎకరాల్లో కాయగూరలు, ఆకు కూరలు సాగుచేస్తున్నాం. స్కూలు పిల్లల మధ్యాహ్న భోజనానికి కూరగాయలు విక్రయిస్తున్నాం. పట్టణ వాసులు ప్రతి వారం కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. పంటల్లో ఘన జీవవామృతం, కలుపు లేకుండా మల్చింగ్, పక్షి స్థావరాల ఏర్పాటుతో కీటకాల నియంత్రణ, లింగాకర్ష బుట్టల ఏర్పాటుతో రెక్క పురుగుల నివారణ, కంటికి కనబడని తామర పురుగు పంటలను ఆశించకుండా గంజి ద్రావణం, బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్నాం. ఇలా తక్కువ పెట్టుబడితో సంవత్సరానికి రెండు లక్షల వరకు ఆదాయం గడిస్తున్నాం. –శైలజ, మహిళారైతు, ఎస్‌బీఆర్‌పురం, వడమాలపేట మండలం

తీగజాతి కూరగాయల సాగు



మూడేళ్లుగా ప్రకృతి సాగులో తీగ జాతి కూరగాయలు సాగుచేస్తున్నాం. ప్రస్తుతం పొలంలో భూసారం తగ్గకుండా పంటకు పంటకు మధ్యలో 30 రకాల చిరు, పప్పు ధాన్యాలను చల్లుతున్నాం. వచ్చే పంటను పశువులకు గ్రాసంగా వాడుతున్నాం. దీనిద్వారా పాల ఉత్పత్తి పెరుగుతోంది. 45 రోజుల్లో పూర్తిగా కోతకోసి భూమిలో పశుగ్రాసం వేర్లను దున్నడంతో తేమశాతం, కార్బన్‌డయాక్సైడ్, నత్రజనితో రసాయనాలు అవసరం లేని సారవంత భూమిగా మారుతోంది. వెంటనే కాకర, గోరు చిక్కుడు, చిక్కుడుతో పాటు, అంతర పంటలు కంది, మొక్కజొన్న వంటివి వేస్తుంటాం.రెండెకరాల్లో ఏడాదికి 4 లక్షలకుపైగా ఆదాయం వస్తోంది. భార్య, భర్తలిద్దరం బీఈడీ వరకు చదువుకున్నాం. ప్రకృతి సాగు ఆవశ్యకత సమాజానికి అవసరం. –శ్రీవాణి, శిరుగురాజుపాళెం, పుత్తూరు మండలం

ఇదీ పాయే!



ఒకప్పుడు అధికార మదంతో అడ్డదారులు తొక్కుతూ పేట్రేగిపోయిన టీడీపీ నాయకులు ఇప్పుడు డీలాపడిపోయారు. ఎన్నికలు ఏవైనా సరే పోటీ చేయాలంటేనే భయపడిపోతున్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వంతో ఢీకొనలేక చేతులెత్తేస్తున్నారు. ఇదేకోవలో గత నాలుగేళ్లుగా జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ నామినేషన్ వేయడానికి వణికిపోయారు. చివరకు నామమాత్రంగా వేసిన ఒక్కగానొక్క నామినేషన్ తిరస్కరణకు గురవ్వడం.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో మరింత చతికిలపడిపోయారు.

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏకగ్రీవం
- టీడీపీకి నామినేషన్ వేసేవారే కరువు
- వేసిన ఒక్క నామినేషన్ తిరస్కరణ
- వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

సాక్షి, తిరుపతి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వన్నెకుల క్షత్రియ (బీసీ) సామాజికవర్గానికి స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం, ఆపై ఏకగ్రీవంగా ఎన్నికకావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ అభ్యర్థి ధనుంజయులు వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సమర్పించకపోవడంతో టీడీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఉమ్మడి చిత్తూరు చంద్రబాబు సొంత జిల్లానే అయినా వైఎస్సార్‌సీపీ కంచుకోట. ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే జనం పట్టం కట్టారు. 14 అసెంబ్లీ స్థానాలకుగాను 13 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మూడు పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ స్వీప్ చేసింది.

ఫంకా..విజయ ఢంకా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ నాలుగేళ్ల కాలంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అధికశాతం విజయం సాధించారు. టీడీపీ, జనసేన కుమ్మక్కై కుట్రలు చేసినా జనం వారి మాటలు, రాతలను తిరస్కరించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం మున్సిపాలిటీకి జరిగిన తొలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు 19 మంది విజయం సాధిస్తే, టీడీపీ తరుపున ఆరుగురు మాత్రమే గెలుపొందారు. అదేవిధంగా జెడ్పీటీసీలు నలుగురుంటే అన్నింటినీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే సొంతం చేసుకున్నారు. 68 ఎంపీటీసీ స్థానాలకుగాను 64, 89 సర్పంచ్ స్థానాల్లో 74 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. టీడీపీ హయాంలో చక్రం తిప్పిన మంత్రులు, ఎమ్మెల్యేల నియోజక వర్గాల పరిధిలోనూ వైఎస్సార్‌సీపీ జోరును అడ్డుకోలేకపోయారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట

టీడీపీ బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుంది. వారికి ఉన్నత పదవులు ఇచ్చిన దాఖలాలు లేవు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను బ్యాక్ బోన్‌గా పరిగణించారు. అందుకే వారికి ఉన్నత పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారు. అందులో భాగంగా వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకి స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దించారు. దీంతో ఆ సామాజికవర్గం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

అసెంబ్లీ స్థానాలు	14	జెడ్పీటీసీలు మొత్తం	65
వైఎస్సార్‌సీపీ	13	వైఎస్సార్‌సీపీ	65
టీడీపీ	01	టీడీపీ	0
ఎంపీటీసీలు మొత్తం	877	కార్పొరేటర్లు మొత్తం	100
వైఎస్సార్‌సీపీ	825	వైఎస్సార్‌సీపీ	94
టీడీపీ	40	టీడీపీ	05
స్వతంత్రులు	11	పెండింగ్	01
సీపీఐ	01		

పరిశ్రమల స్థాపనకు స్వర్గధామం

- తిరుపతిలో పరిశ్రమల స్థాపన, రాయితీలపై రెండు రోజుల ఎగ్జిబిషన్
- ఎంపీ గురుమూర్తి, ఎస్వీయూ వీసీ రాజారెడ్డి హాజరు



ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్: నగరంలోని కరకంబాడి రోడ్డు మార్గంలోని ఓ హోటల్‌లో కొనుగోలు దారులు, అమ్మకపుదారులను ఒకే వేదికపై తీసుకురావాలనే ఉద్దేశంతో సోమవారం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, బయ్యర్ – సెల్లర్ ఇంటర్యాక్షన్ మీట్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ కార్యాలయం విశాఖపట్టణం వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు (సోమ, మంగళవారాలు) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు సోమవారం పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహాలు, రాయితీలను పారిశ్రామిక వేత్తలు చర్చించుకున్నారు. కొత్త పరిశ్రమల వారు బ్యాంకుల నుంచి పొందుతున్న రుణాలను వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందాల్సిన ప్రోత్సాహాలను తెలియజేశారు.

పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం మెండు

కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం మెండుగా ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఉత్పత్తులు, ఎగుమతులు, దిగుమతులు, మార్కెట్ వ్యవహారాలను తెలుసుకున్నారు. తిరుపతి జిల్లాలో పరిశ్రమలకు వెంటనే అనుమతులు వస్తున్నాయని చెప్పారు. భూములు ఇవ్వడమే కాకుండా సకల వసతులు కల్పించడానికి ప్రభుత్వ సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎస్వీయూ వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎస్వీ యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీగా సహకారం అందిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈడెవలప్‌మెంట్ ఫెసిలిటేషన్ కార్యాలయ ఏడీ జీవీఆర్ నాయుడు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవడం కోసం ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో బ్యాంకర్లు, ఎగ్జిబిటర్స్ తమ రుణ సౌకర్యాలను, ఉత్పత్తులను వివరించారు. ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో దక్షిణ మధ్య రైల్వే అవసరాలకు కావాలసిన పరికరాలు, వైజాక్ స్టీల్ ప్లాంట్ తదితర వాటిని వివరించారు. దక్షిణ మధ్య రైల్వేస్ మార్కెటింగ్ రామాంజనేయ, జిల్లా పరిశ్రమల జీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌బీఐ ఏజీఎం మురళీ, ఆర్ఐఎన్ఎల్ ఏజీఎం ప్రసాద్, నయారా ఎనర్జీ, జడ్.ఎం.రవి శంకర్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి

ఓపెన్ స్కూల్‌తో ఇంటర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్‌స్కూల్ విధానం ద్వారా పూర్తిచేయొచ్చని ఆర్ఐఓ రమేష్ తెలిపారు. ఇలా పూర్తిచేసిన వారు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా పరిగణిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఓపెన్ స్కూల్ కేంద్రాలను సందర్శించాలని ఆయన సూచించారు.

గెలుపే లక్ష్యం..సమష్టిగా పనిచేద్దాం

వెంకటగిరి: పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నివాసంలో వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులకు వెంకటగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించేలా కృషిచేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, పద్మశాలీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు సీహెచ్ ఉమామహేశ్వరి, ఎస్.బాలయ్య, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్లు తోట గణేష్‌రెడ్డి, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతికి చెందిన మధు వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అతను 2010లో తిరుపతి ఖాదీకాలనీకి చెందిన సాకమూరి రంగయ్య చౌదరి వద్ద రూ.5.25 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బౌన్స్ కావడంతో కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వైద్య విద్యార్థులకు పరిశోధన శిక్షణ

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురంలో సోమవారం ఎస్వీ వైద్య కళాశాల పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్(ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య పరిశోధనపై శిక్షణ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి రోగుల స్థితిగతులను సేకరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ హెచ్‌ఓడీ రవి ప్రభు, ప్రొఫెసర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

క్షణాల్లో బుగ్గి

- ఫాక్స్‌లింక్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం
- షార్ట్ సర్క్యూటే కారణమా?



మంటల్లో కాలిబూడిదైన రేణిగుంట ఫాక్స్‌లింక్ కంపెనీ



భయంతో బయటకు పరుగులు తీస్తున్న ఉద్యోగులు

రేణిగుంట: రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రికల్ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. చార్జింగ్ వైర్ల విడి భాగాలను అనుసంధానం చేసే అసెంబ్లింగ్ యూనిట్, దానికి ఎదురుగా ఉన్న మరో యూనిట్ క్షణాల్లో కాలిబూడిదయ్యాయి. ప్రాణభయంతో కార్మికులు పరుగులు తీయగా.. అగ్నిమాపక సిబ్బంది, ఇతర అధికారులు హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

షార్ట్‌సర్క్యూటే కారణం

మొత్తం ఏడు మీటర్ల ఎత్తులో రూఫ్ ఉన్న ఈ భవనంలో కింద భాగం నాలుగు మీటర్లు, పై భాగంలో ఉన్న మూడు మీటర్లలో ఫాల్‌సీలింగ్‌ను ఏర్పాటు చేశారు. దాని పైభాగంలో రూఫ్, ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన గ్లాస్ ఊల్, దానికింద ఇనుప వలతో ఫ్యాక్టరీలో రూఫ్ పైభాగాన్ని నిర్మించారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో కింద ఏమీ తెలియకుండా పైభాగంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. ఫ్యాక్టరీ నిండా ప్లాస్టిక్, మండే గుణం ఉన్న వైర్లు ఉండడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. అయితే కంపెనీ యాజమాన్యం సేఫ్టీ చర్యలు చేపట్టడంలో అనుమానాలున్నాయని అధికారులు ఆరా తీస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యే పరిశీలన

ప్రమాద విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి నష్టనివారణకు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే తిరుపతి ఈఎంసీ సీఈఓ గౌతమి చేరుకుని పరిశీంచి జిల్లా కలెక్టర్‌కు వివరాలను తెలియజేశారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రామకృష్ణారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి నరేంద్రబాబు తదితరులు ప్రమాదం జరిగిన ఫ్యాక్టరీలో పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.



దట్టంగా కమ్ముకున్న పొగలు



కంపెనీ వద్ద ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పరిశీలిస్తున్న ఈఎంసీ సీఈఓ గౌతమి

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె సోమవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, పద్మావతి డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు తిరుపతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ అడిగినందుకు మూకుమ్మడి దాడి

నాయుడుపేటటౌన్: బాకీ అడిగినందుకు ముగ్గురు యువకులతో కలిసి మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితుడు బొమిడి శ్రీనివాసులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు పుదూరు గ్రామానికి చెందిన చైతన్య అనే యువకుడికి నగదు అప్పుగా ఇచ్చాడు. ఎంతకీ తిరిగి ఇవ్వకపోవడంతో అతనిని నిలదీశాడు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని రజక కాలనీ వద్ద చైతన్య మరో ఇద్దరు యువకులు మునిరాజా, సంపత్‌తో వచ్చి రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాయపడిన శ్రీనివాసులును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయండి



జిల్లా స్థాయి పదవులు పొందిన సురేష్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, శివకుమార్‌ని సత్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: జిల్లా స్థాయిలో వైఎస్సార్‌సీపీ పార్టీ పదవులు పొందిన నేతలు క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన నివాసంలో తిరుపతి జిల్లా ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు, కలువాయి జెట్పీటీసీ సభ్యుడు బీ అనీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్‌ని ఆయన ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, సీనియర్ నేతలు చెలికం శంకరరెడ్డి, పి దశరథరామిరెడ్డి, టి శివారెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, పి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకోన సిద్ధేశ్వరునికి విశేష పూజలు

ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో ఆదిదంపతులు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

మిలటరీ మద్యం తరలించిన వ్యక్తికి రిమాండ్

తిరుపతి లీగల్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీసులో మిలటరీ మద్యం బాటిళ్లను అక్రమంగా రవాణా చేసిన కేసులో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వెంకటేశ్ అలియాస్ మేకల వెంకటరమణకు మార్చి 13వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డిసెంబర్ 26న గిద్దలూరు నుంచి తిరుపతికి ఆర్టీసీ కార్గో సర్వీసు నుంచి తిరుపతిలోని గోపి అనే వ్యక్తి పేరున పార్శిల్ వచ్చింది. పార్శిల్ నుంచి వాసన రావడంతో సర్వీసు సిబ్బంది మద్యం బాటిళ్లుగా గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) సుబ్బారావు ఎస్ఈబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు వెంకటేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

పలువురికి జరిమానా

తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బు పెట్టి పేకాట ఆడడం తదితర నేరాలకు పాల్పడిన పలువురికి 35 కేసుల్లో రూ.18,800 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు సోమవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా పేకాట ఆడిన వారి నుంచి పోలీసులు రూ.67,200 సీజ్ చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు.

ప్రవీణ్‌కు కాంస్య పతకం



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్

నారాయణవనం: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కు కాంస్య పతకం లభించింది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 బాలుర క్రికెట్ పోటీల్లో చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టు రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి, కాంస్య పతకం కైవసం చేసుకుంది. జిల్లా జట్టు తరపున ఆడిన తొమ్మిదో తరగతి విద్యార్థి పీఎస్ ప్రవీణ్ జట్టులో ప్రత్యేక ప్రతిభను కనపరిచి కాంస్య పతకాన్ని సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు తెలిపారు. సోమవారం పాఠశాల ప్రార్థనా సమయంలో ప్రవీణ్‌కు సర్టిఫికెట్, కాంస్య పతకాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను, వ్యాయామ అధ్యాపకులు జయప్రకాష్‌ను అభినందించారు. అలాగే గుటూరు జిల్లా పల్నాడులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన జిల్లా జట్టు తరపున అరణ్యకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థిని వసును పాఠశాల హెచ్‌ఎం ధనుంజయ నాయుడు అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనుబంధ పోలింగ్ కేంద్రలతోపాటు 101 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఈనెల 23వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం పట్టభద్రులకు సంబంధించి 86,941 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో మొత్తం 6,132 మంది ఓటర్లు ఉనన్నట్టు వెల్లడించారు. 7 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యావేక్షణ చేపడతాయన్నారు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లలో 23 సెక్టార్లు ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లు, 15 మంది నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 23 రూట్లకు గాను 31 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామని, 24 స్ట్రైకింగ్ బలగాలు, 7 ప్రత్యేక స్ట్రైకింగ్ బలగాలు, 4 స్క్వాడ్ టీమ్‌లు ఉంటాయన్నారు. సమీక్షలో ఆర్డీఓలు కనక నరసారెడ్డి, రామారావు, చంద్రమునిరాయల్, కిరణ్ కుమార్, అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య పలువురు రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య



ప్రసాద్ మృతదేహం

వెంకటగిరి: మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన భర్త ఎవ్వరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం పట్టణంలోని బొగ్గులమిట్ట ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. నెల్లూరు చంద్రమౌళినగర్ ప్రాంతానికి చెందిన మారెళ్ల ప్రసాద్ (40), తన భార్య వీరరాఘవమ్మతో కలిసి ఆల్లూరుపాడు గ్రామంలో నివాసం ఉండేవారు. వీరరాఘవమ్మ రేణిగుంట సమీపంలోని ఓ ప్రయివేటు ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తోంది. ప్రసాద్ స్థానికంగా టిప్పర్ డ్రైవర్. ఈ క్రమంలో తమకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో నాలుగు నెలల క్రితం భార్యాభర్తలిద్దరూ స్థానిక బొగ్గులమిట్టలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. ఈ క్రమంలో ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యానికి డబ్బులేకపోవడంతో విధుల్లో ఉన్న భార్యకు ఫోన్ చేశాడు. డబ్బులు కావాలని అడగగా ఆమె సాయంత్రం వరకూ వేచి ఉండాలని చెప్పింది. మనస్తాపం చెందిన ప్రసాద్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని తనువు చాలించాడు. భార్య వీరరాఘవమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంలో నీళ్లు కలిపి విక్రయం

– ముగ్గురి అరెస్ట్

వడమాలపేట: మద్యంలో నీళ్లు కలిపి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. స్థానిక రామసముద్రం రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో తిరుపతికి చెందిన ధనశేఖర్ కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. వైన్‌షాప్‌లో మద్యం తీసుకొచ్చి అందులో నీళ్లు కలిపి అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ముని, రవీంద్రరాజు, ధనశేఖర్‌ను అరెస్టు చేసి పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

గణనాథుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ప్రియదర్శిని కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని భార్య దుర్మరణం

- భర్తకు తీవ్ర గాయాలు



రాజేశ్వరి మృతదేహం



రాజేశ్వరి (ఫైల్)

గూడూరు రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. గూడూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. డక్కిలి మండలం, కందలవారిపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య, రాజేశ్వరి(27) దంపతులు. వీరిద్దరూ ఓ పని నిమిత్తం సోమవారం చిల్లకూరు మండలం, మోమిడి గ్రామానికి మోటారు సైకిల్‌పై బయలుదేరారు. గూడూరు పట్టణ సమీపంలోని సాయిబాబా మందిరం దాటిన తర్వాత ముందువెళుతున్న మోటారు సైకిల్‌ను సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య రాజేశ్వరి అక్కడికక్కడే దుర్మరణం చెందగా భర్త బంగారయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన బంగారయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.